# "నాలుగు స్తంభాలు"

—ఎమ్మెస్సార్. మూర్తి

అతడు :

నవ్వే ఆడదాన్ని, ఏడ్చే మగవాణ్ణీ నమ్మకూడదన్నారు.

ఆ నొప్పుల బాధ తట్టుకోడానికి, గోరువెచ్చని, రక్తంలాంటి బ్రాందీ రెండౌన్సులు తాగి, బాధ మరచిన ఆమె ముసిముసిగా నవ్వుతూ ముచ్చటగా "డెలివరీ" అయింది.

మగపిల్లవాడే !

మర్చిపోయి ఏడ్చాడు. అంతే ! మరెప్పుడూ ఆ సంగతి ఎత్తలేదు.

"మమ్మీ" అన్నాడు.
"ఏం నాన్నా ?" అంది.
"ఆపిల్" అన్నాడు.

ఎక్కువగా తింటే ఆరోగ్యం చెడుతుందని అనుకుంటూనే, తనో పెద్దముక్క తింటూ తనయుడికో చిన్నముక్క ఇచ్చింది. చక్కలిగిలిపెట్టింది. అతగాడి అందిన అవయవాలన్నీ పెదాలతో తడిపి ప్రేమ ముసురు పట్టించింది.

ఆమె అతణ్ణి మరెప్పుడూ ఏడవనివ్వలేదు.

అంచేత అతడు, "ఏడిస్తే నమ్మకూడని" మగాళ్ళలో చేరలేదు.

మరందుచేతనే గామోసు... అందరూ అతన్ని నమ్మారు.

రాకుమార్తెల్లా పుట్టిన రాయంచల్లాంటి అమ్మాయిలూ...

అందంలో వాళ్ళనిమించిన సామాన్యుల కూతుళ్ళూ...

అతన్నే నమ్ముకున్నారు. వాళ్ళల్లో కొంతమంది మరీ "డిలే" భరించలేక తమని తాము అమ్ముకున్నారు. తినే అనుభవం దగ్గర్నుంచీ, అనుభవించే ఆనందం వరకూ అన్నీ కొనుక్కోగలిగిన అతను, నవ్వుని వేరేగా కొనుక్కోవాలా ?

కొనుక్కున్న వాటన్నిటితో, రకరకాల నవ్వులన్నీ అతనికి "కొసరు"లా వచ్చాయి. ఆ నవ్వులే అతనికి ఆరోగ్యానిచ్చేయి. ఆరోగ్యం హాయిగా తినమంది.

తిన్నవళ్ళు ఊరుకోక తిరగమంది.

తిరుగుడులోని శ్రమకి తల ఓ రకంగా తిరిగితే, ఆ అలసట తీరడంకోసం తాగినదాన్తో అదే తల మరొక రకంగా తిరిగింది. తిరుగుతున్న తలనీ, తిరిగే కాలునీ ఆసరా చూసుకుని యవ్వనం తానూ తిరగబడింది.

ఎర్రగా విరగబడింది.

అలా విరగబడిన సున్నపురాయిలా తను

తెల్లగా వెలిగిపోయేడు. వెన్నెల్లో కరిగిపోయేడు. అనుభవంలో ఆరితేరిపోయేడు.

అలా...అలా... ఊరిపోయేడు.

పోయి...పోయి... అదేదో కనపడని క్కీర్తిని పారేసుకుంటూ తనని తాను మోసుకుపోయేడు.

ఇతడు :

ఏడ్చే మగవాణ్ణీ నవ్వే ఆడదాన్నీ నమ్మకూడదనే అన్నారు.

ఈమె ఇదివరకెప్పుడూ నవ్వలేదు. మరి ఈమెను ఎంతమంది నమ్మారో తెలీదుకానీ, తాను నమ్ముకున్న దేవుఁడు నవ్వినట్టుగా ఓరోజు ఈమెకు కడుపులో పడ్డాడు.

ఈమె...నానా నొప్పుల్తోను—సీళ్ళాడి—నవ్వలేక నవ్వింది. అదే ఈమె మొదటిసారి నవ్వుకోవడం.

సరే... వీడూ ఏడ్చాడు.

తట్టా—మట్టీకి అంటిపెట్టుకు పొట్టపోసుకునే ఈమెని వీడు అదేపనిగా ఏడిపించాడు.

ఎడాపెడా ఏడ్చాడు.

ఇలా అస్తమానం ఏడుస్తున్న వీణ్ణి, ఎంత అమ్మైనా ఎలా నమ్ముతుందీ ?

"అమ్మా" అన్నాడు.
"ఏఁ బాబూ..." అంది.
"ఆకలి" అన్నాడు.

ఆకలి తీర్చ గా తీర్చగా ఆ కాస్త మాతృకామృతం అయిపోయింది.

అన్నం కావలసివచ్చినరోజున ''అవసరం" ఈ అమ్మనీ, కొడుకునీ వేరుచేసింది. ఈ పసివళ్ళు ముళ్ళబాటలో దొర్లింది. పుండయింది. తెలియని ఆశల పసరులతో అప్పుడప్పుడూ మానుతూవచ్చింది.

ఇలా చూస్తుండగానే వయసు ఎదిగొచ్చింది. అలసిన ఈ వయసుకో ఆసరా కావాల్సివచ్చింది. ఈ ఆసరాలో అనాలోచితంగా విశ్రమిస్తే, మరింకొకరికీ, మరింకొకరికీ ఆశ్రయం ఇస్తూ పోవాల్సివచ్చింది.

ఆశ్రయించినవాళ్ళకి ఆ మాత్రమైనా సమకూర్చలేక ఆవేదన హెచ్చింది. ఆ వేదనతో మనసు ముసలిదైపోయింది. మనసుతో ముడిపడ్డ శరీరం మరెక్కడికీ కదల్లేక మూలపడింది.

కావాలని వచ్చి, కాలధర్మం ఇతణ్ణి మోసుకుపోయింది.

ఇలా...ఇతను... చచ్చిగానీ పోలేకపోయేడు.

* * *

ఆకలి రుచి ఎరగదు.
నిద్ర సుఖమెరగదు.
రచనలు నిజమెరుగవు.
అతడూ...ఆపిల్...కీర్తీ
వీడూ...ఆకలీ...చావూ
నేనూ...రుచీ...బ్రతుకూ...
నువ్వూ...సుఖమూ...తెరువూ...

మనం నలుగురం ఈ ''నాలుగు స్తంభా లాట" ఆడుకుంటూ అలసిపోతే ''అంబాలీస్" అనుకుంటూ..